
సాక్షి పల్నాడు

మంగళవారం ׀ 10 ׀ అక్టోబర్ ׀ 2023




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 3007 క్యూసెక్కులు విడుదల చేశారు.



అంకమ్మతల్లికి పూజలు

దాచేపల్లి : తక్కెళ్లపాడులోని అంకమ్మతల్లి, గోపయ్యస్వామి, గంగమ్మతల్లి ఆలయాల్లో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 525.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,496 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

సాగర్ జలాలు విడుదల

శావల్యాపురం: తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ జలాలను విడుదల చేసినట్లు ఎన్ఎస్పీ ఏఈ పొట్లూరు లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సాగర్ జలాశయం నుంచి ఐదు టీఎంసీల నీటిని బోగ్గువాగుకు విడుదల చేశారని పేర్కొన్నారు. మండలంలోని గంటావారిపాలెం సమీపాన ఉన్న అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు ఈనెల 11వ తేదీ నాటికి సాగర్ జలాలు చేరుతాయని వివరించారు. 12 రోజుల పాటు సాగర్ జలాలు విడుదలవుతాయని మంచినీటి చెరువులు, కుంటలు తదితరాలన్నీ పూర్తిస్థాయిలో నింపాలని సూచించారు.

యార్డుకు 29,046 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 29,046 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 27,633 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,000 నుంచి రూ.22,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,500 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,481 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

5కే రన్ బ్రోచర్ ఆవిష్కరణ



ఏఎన్‌యూ: గుంటూరులోని బీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న ఓపెన్ 5కే రన్ బ్రోచర్‌ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ తన చాంబర్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నిర్వహించనున్న 5కే రన్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య పి.జాన్సన్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్దయ్య, ఏపీ అథ్లెటిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరి జీవీఎస్ ప్రసాద్, పోటీల కమిటీ అధ్యక్షుడు నరాలశెట్టి రవికుమార్ పాల్గొన్నారు.

జిల్లా జైలులో పలు పోస్టులకు దరఖాస్తులు

పట్నంబజారు: గుంటూరు జిల్లా జైలు పరిధిలోని కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్స్ విధానంలో పలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు గుంటూరు జిల్లా జైలు పర్యవేక్షణాధికారి కె.రఘు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ కలిగి ఉన్న డ్రైవర్‌కు రెండు పోస్టులకు రూ.18,500 జీతం ఇస్తారని పేర్కొన్నారు. అదే విధంగా కార్యాలయ సబార్డినేట్, వాచ్‌మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వారికి రూ.15 వేలు జీతం ఇస్తారని వివరించారు. ఈ నెల 6వ తేదీ నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. వివరాలకు https//guntur.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలి



మంగళగిరి: నగరంలోని గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి గుడిలో(శివాలయం)లో జరిగే దసరా బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కోరారు. నగరంలోని శివాలయంలో సోమవారం ఎమ్మెల్సీ హనుమంతరావు ఆప్కో మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవితో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయంలో జరుగుతున్న మరమ్మతులను వీలైనంత త్వరగా పూర్తి చేసి భక్తులు స్వామిని దర్శించుకునేందుకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈవో ఎ.రామకోటిరెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నేరెళ్ళ లక్ష్మీరాధిక, బోర్డు సభ్యులు కొల్లి ముసలారెడ్డి, రేఖా వకుళాదేవి, అద్దంకి వెంకటేశ్వర్లు, అర్చకులు బోర్డు ఎక్స్ అఫీషియో సభ్యుడు తెలకపల్లి మహేష్ శర్మ, శ్యాంసుందర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ వైద్యం.. సువర్ణాధ్యాయం

- ఏపీ పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి
- పల్నాడు జిల్లా కొండవీడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం పరిశీలన
- చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామ సచివాలయంలో ఆకస్మిక తనిఖీ
- పంచాయతీ ఆదాయ వనరుల పెంపునకు కృషి చేయాలని సూచన



కొండవీడు జేపీఎస్‌లో మందుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఏపీ పంచాయతీ రాజ్ కమిషనర్ పి సూర్యకుమారి

యడ్లపాడు: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ప్రతి ఒక్క కుటుంబానికీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని, తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే మెరుగైన వైద్యం తరలి వస్తోందని, ఇదో సువర్ణాధ్యాయమని ఏపీ పంచాయతీరాజ్ కమిషనర్ పి.సూర్యకుమారి పేర్కొన్నారు. పల్నాడు జిల్లా కొండవీడు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ముందుగా ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్లను ఆమె పరిశీలించారు. ఇంటింటి సర్వేలో ప్రజలకు ఇచ్చిన టోకెన్ ద్వారా కేస్ షీట్‌ను ఏ విధంగా నమోదు చేసి, వైద్యులకు రిఫర్ చేస్తున్నారనే అంశాన్ని పరిశీలించారు. ప్రజల సమస్యలను గుర్తించి ఖరీదైన పరీక్షలు, సర్జరీలు అవసరమనుకుంటే సంబంధిత ఆస్పత్రికి పంపేలా చర్యలు తీసుకోవాలని స్పెషలిస్టు వైద్యులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే సమయంలో ఇంటింటికీ వైద్య సిబ్బంది చేసిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఎన్ని, వారికి జారీ చేసిన కూపన్ల సంఖ్య, నేడు శిబిరానికి వచ్చిన ఓపీ రిజిస్ట్రేషన్ల ఎన్‌రోల్ వ్యత్యాసాన్ని ఆన్‌లైన్‌లో చూశారు. బీపీ, షుగర్, వివిధ రక్త పరీక్షలతోపాటు ఈసీజీ రిపోర్టులను గమనించారు. వైద్య పరీక్షలు, చికిత్సలు, ఉచిత మందుల పంపిణీ గురించి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూర్యకుమారి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సాహసోపేతమైనదని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న ధ్యేయంతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి స్థానికంగానే ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

పంచాయతీ ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలి

పల్లెలు ప్రగతి సాధించాలంటే పంచాయతీ ఆదాయం పెరగాలని, అందుకు స్థానికంగా ఆదాయ వనరులపై అధికారులు దృష్టి సారించాలని ఏపీ పంచాయతీ రాజ్ కమిషనర్ పి.సూర్యకుమారి పేర్కొన్నారు. జేపీఎస్ క్యాంపు పరిశీలన అనంతరం చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీకి వచ్చిన నిధులు, వాటి వినియోగం, చేస్తున్న అభివృద్ధి పనులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలకు సంబంధించిన అన్ని విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్‌శాఖకు పంచాయతీలు ఇవ్వాల్సిన బకాయిల్ని సకాలంలో చెల్లించి ప్రజలకు గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలన్నారు. అలాగే ఎనర్జీ అసిస్టెంట్లు విద్యుత్ చౌర్యం, వృథా కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. తడిపొడి చెత్త నిర్వహణ మాదిరిగానే మురుగు నీటిని భూగర్భంలోకి వెళ్లేలా ఇంకుడు గుంతల్ని ఏర్పాటు చేసి స్వచ్ఛ సర్వేక్షణ్ నూరుశాతం విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.హనుమారెడ్డి, డీపీవో భాస్కరరెడ్డి, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఈవోపీఆర్డీ వరూధిని, పీఏసీఎస్ చైర్మన్ బసెల శివరామకృష్ణ, సర్పంచ్‌లు మహమ్మద్ యూనీస్, ఎం పోలవతి, కార్యదర్శి రజిని, హెచ్ఎం జి.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ శివశంకర్

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి

కలెక్టర్ శివశంకర్ వెల్లడి

నరసరావుపేట: కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమానికి కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షత వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ ఎం.ఆర్.కల్పశ్రీ, డీఆర్వో కె.వినాయకం వినతులు స్వీకరించారు. మొత్తం 191 అర్జీలు వచ్చాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఉచిత భోజన వసతి కల్పించారు.

విద్యార్థులకు సాయం

స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జరిగిన కార్యక్రమంలో సోమవారం కలెక్టర్ ఎల్.శివశంకర్ జిల్లాస్థాయికి అర్హత సాధించిన క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్ర కిట్లు అందజేశారు. అనంతరం బెల్లంకొండ మండలం రేమిడిచర్ల గ్రామానికి చెందిన పేద విద్యార్థిని భూక్య శిల్పారాణిబాయ్‌కి రూ.70 వేల నగదును అందజేశారు. ఫార్మసీలో టాపర్‌గా నిలిచిన శిల్పారాణి జీప్యాట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఫార్మసీ సీటు పొందారు. ఆమెను ప్రోత్సహించేందుకు జిల్లా ఎస్సీ, ఎస్టీ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఈ నగదును అందజేసింది.

ఎన్ఐఏ సోదాలు ఆపాలి

> ప్రజా, పౌరహక్కుల సంఘాల నాయకులు, న్యాయవాదుల ఇళ్లపై ఎన్ఐఏ చేస్తున్న దాడులను ఆపాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ 62 మంది ఇళ్లల్లో ఎన్ఐఏ అధికారులు సోదాలు చేశారు. ఢిల్లీలో న్యూస్‌క్లిక్ పత్రిక యాజమాన్యంపై ఉపా కేసులు నమోదు చేశారు. భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఎన్ఐఏ ఆగడాలను అరికట్టి రక్షణ కల్పించాలి.
>
> – పీడీఎం నాయకులు శ్రీనివాసరావు, రామకృష్ణ, రామారావు, బొప్పూడి అంజమ్మ

కారుణ్య నియామకం

- 2016లో పులిచింతల ప్రాజెక్టు గేట్లు ఎత్తిన సమయంలో వరదలో కొట్టుకుపోయిన జాను నాయక్ కుమారుడు సైదానాయక్‌ను కారుణ్య నియామకం ద్వారా ఔట్‌సోర్సింగ్ విధానంలో ఆఫీస్ సబార్డినేట్ పోస్టులో నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులను అందజేశారు. జిల్లాలో చేనేత వస్త్రాలను ప్రోత్సహించడంలో భాగంగా జిల్లా అధికారులు అందరూ చేనేత వస్త్రాలు ధరించి కార్యక్రమానికి హాజరు కావటం విశేషం.

● జై జగ'నిజం'



ప్రతినిధుల సభకు వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆత్మీయంగా పలకరిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చిత్రంలో మంత్రులు జోగి రమేష్, ఆర్కే రోజా

విజయవాడలో సోమవారం జరిగిన వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభ ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు జయహో జగనిజం అంటూ నినదించారు. రాష్ట్రానికి వైఎస్ జగన్ అవసరం అంటూ జయ గళమెత్తారు. సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం అంటూ గర్జించారు. ఈ సభలో జిల్లాకు చెందిన పార్టీ నేతలు స్ఫూర్తిదాయ ప్రసంగాలు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్







సభలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి

- కలెక్టర్ శివశంకర్ లోతేటి
- సబ్సిడీపై విత్తనాల పంపిణీ ప్రారంభం

నరసరావుపేట రూరల్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టిసారించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సూచించారు. మండలంలోని జొన్నలగడ్డ ఆర్‌బీకేలో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన, రాయితీపై విత్తనాల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. తొలుత గ్రామంలో సాగైన పత్తి, మిరప పంటలను కలెక్టర్ పరిశీలించారు. ఈ-పంట నమోదు, గులాబీ పురుగు నివారణ చర్యల గురించి రైతులు, వ్యవసాయ సిబ్బందితో మాట్లాడారు. పత్తి పంటపై ఆశించే తెల్ల తామర పురుగు గురించి రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో పాటు నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి నీటి విడుదల లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయని ప్రాంతాల్లో సబ్సిడీపై శనగ, మినుము విత్తనాల పంపిణీ చేసి రైతులకు అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. శనగ విత్తనాలు 40 శాతం, మినుము విత్తనాలు 80 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తున్నట్టు తెలిపారు. రైతులు కాబూలీ రకం శనగ విత్తనాలు కావాలని అడుగుతున్నారని, దీనిపై ఏపీ సీడ్స్ అధికారులతో మాట్లాడి విత్తనాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఒకే పంటను పండించడం ద్వారా భూసారం దెబ్బతింటుందని పేర్కొన్నారు. పంట మార్పిడి విధానం వలన భూమి ఆరోగ్యం మెరుగవుతుందని వివరించారు. ఇటువంటి ప్రయోగాలు చేసి విజయవంతంగా దిగుబడులు సాధించిన రైతుల అనుభవాలను ఒకరికొకరు పంచుకోవాలన్నారు. ఆర్‌బీకేల ఏర్పాటు ద్వారా వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంటున్నారని, గతంలో ఈ పరిస్థితి లేదని తెలిపారు. రైతులకు ఎదురయ్యే సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు సిబ్బంది కృషిచేస్తున్నారని చెప్పారు. రైతులు పొలాలను ఖాళీగా ఉంచొద్దని సూచించారు. అనంతరం రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీఏఏటీటీసీ శాస్త్రవేత్త డాక్టర్ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ, సర్పంచ్ కుందా చిన్నా, ఎంపీటీసీ ఇండ్ల సానియా, ఏపీ సీడ్స్ మేనేజర్ సుబ్బయ్య, సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ, వ్యవసాయ అధికారులు నరేంద్రబాబు, హరిప్రసాద్, వీఏఏ ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

మర్కటాలపై మాయోపాయం



యడ్లపాడు: గ్రామంలో వానరాల బెడదను నివారించేందుకు లింగారావుపాలెం పంచాయతీ కార్యదర్శి జి.సురేష్‌కుమార్ వినూత్న ఆలోచన చేశారు. యూట్యూబ్‌లో చూసిన ఫన్నీ వీడియో ఆధారంగా మనిషికి గొరిల్లా వేషం వేసి కోతులను తరమాలని నిర్ణయించారు. తెలంగాణలోని ఓ గ్రామ సర్పంచ్ ఇలాంటి ప్రయోగమే చేసి ఫలితం సాధించినట్టు తెలుసుకుని అమెజాన్‌లో గొరిల్లా వేషపు తొడుగును రూ.ఏడువేలకు ఆర్డర్ చేసి తెప్పించారు. సోమవారం గ్రామంలో ఓ పారిశుద్ధ్య కార్మికుడికి గొరిల్లా వేషం వేయించి కోతులు అధికంగా ఉన్న కనపర్తి వీధిలో తిప్పించారు. దీంతో కోతులు భయపడి ఊరు విడిచి పరారయ్యాయి. కోతులు ఎప్పుడు గ్రామంలోకి వచ్చినా.. ఇలాగే గొరిల్లా వేషధారిని రంగంలోకి దించాలని పంచాయతీ పాలకవర్గం నిర్ణయించింది. గొరిల్లా వేషధారికి రోజుకు రూ.450 చొప్పున వేతనం ఇవ్వాలని తీర్మానించింది. ఈ ఆలోచనకు సర్పంచ్ షేక్ కరీమూన్, ఎంపీటీసీ సభ్యులు తోకల వీరరాఘవయ్య, ఉపసర్పంచ్ కొంతినేని శివప్రసాద్, గ్రామపెద్దలు ఆలోకం వెంకటలక్ష్మినారాయణ, నంబూరి శివరామకృష్ణ సహకారం అందించినట్టు కార్యదర్శి తెలిపారు.

పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం



గుంటూరు ఈస్ట్: లాలాపేట శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మూడు గ్రూపు దేవాలయాల నూతన పాలకమండలి చైర్మన్, ధర్మకర్త మండలి సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా సూరినేడి దుర్గావర ప్రసాద్ ప్రమాణ సీకారం చేశారు. సభ్యులుగా ఉడుత మహేష్‌కుమార్, దమ్మలపాటి విజయనిర్మల, ఇస్లావత్ గాంధీనాయక్, ఎంబాడి రాంబాబు, సి.వెంకట్రావు, మైలవరపు సుజన, తరిమెళ్ల వనజ, జవ్వాజి లక్ష్మి, ఎక్స్ అఫీషియోగా రత్నకరం తులసి రాఘరామవరప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈవో సూర్యప్రకాష్ సభ్యులతో ప్రమాణం చేయించారు.

క్లుప్తంగా

13 వరకు జాతీయ తపాలా దినోత్సవాలు

పలు కార్యక్రమాలు చేపట్టిన అధికారులు



నరసరావుపేట: జిల్లాలో ఈనెల 9వ తేదీ నుంచి 13 వరకు జాతీయ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం మొదటి రైల్వేగేటు సమీపంలోని పోస్టల్ డివిజన్ కార్యాలయంలో ఆయన విలేకర్లకు వివరాలను వెల్లడించారు. సోమవారం తపాలా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పదోతేదీ మంగళవారం విట్టియా శక్తి కిరణ్ దివస్ అనగా పోస్టల్ అకౌంట్లు తెరిపించటం, 11వ తేదీ బుధవారం ఫిలాటికల్‌డే అనగా రకరకాల స్టాంపులు, నాణేలు సేకరణ, ఫిలాటికల్ డిపాజిట్ అకౌంట్ ఓపెన్ చేయటం, 12వ తేదీ గురువారం మెయిల్స్, పార్సిల్స్, చివరిరోజు 13వ తేదీన అంత్యోదయ దివస్‌లో భాగంగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, అప్‌డేషన్, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు సేవలు, పోస్టాఫీసు ద్వారా చెల్లింపులు నిర్వహించటం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రజలు పాల్గొని సహకరించాలని కోరారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో మస్తాన్ వలి ప్రతిభ



పిడుగురాళ్ల: బాడీ బిల్డింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన మస్తాన్ వలి ప్రతిభ చూపాడు. ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన నిర్వహించిన సెంట్రల్ జోన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచాడు. పల్నాడు జిల్లా నుంచి పిడుగురాళ్ల ఓయాసిస్ జిమ్ ట్రైనర్‌గా పని చేస్తున్న మస్తాన్‌వలికి మాత్రమే అవకాశం రావటం బిల్డింగ్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో మూడో బహుమతి కైవసం చేసుకోవటంతో పలువురు అభినందించారు.

ప్రాచీన కళలకు నూతన సొబగులు

- జిల్లా కలెక్టర్ శివశంకర్
- షార్ట్ ఫిల్మ్ పోటీలు ప్రారంభం



షార్ట్ ఫిల్మ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



విజేతలకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుగడ్డపై పరిఢవిల్లిన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతిబింబాలైన కళలను అభివృద్ధి పరిచి నేటి తరానికి అందించేలా పల్నాడు కళాక్షేత్రం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. పల్నాడురోడ్డులోని పల్నాడు కళాక్షేత్రంలో ఆదివారం తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు-2023 నిర్వహించారు. పోటీల విజేత బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో యువత మానసిక, శారీరక ఆందోళనలకు గురవుతున్న నేపథ్యంలో కళలు సేదదీరుస్తాయని వివరించారు. అదే సమయంలో తెలుగు సంస్కృతిపై అభిరుచి పెరుగుతుందని తెలిపారు. పల్నాడు ప్రాంతంలో మరుగున పడుతున్న కళలను వెలికి తీసి వాటికి నూతన సొబగులు అద్దాలన్నారు. ఇందుకు కవులు, కళాకారులు, కళాభిమానులు ముందుకు రావాలని, వారికి పల్నాడు కళాక్షేత్రం వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. కాగా, షార్ట్ ఫిలిం పోటీలకు 19 ఎంట్రీలు రాగా 'మైరా', 'వై ఇండిపెండెన్స్', 'వ్యక్తిత్వం' తొలి మూడు బహుమతులు సాధించాయి. అలాగే 'ఐదువేళ్లు', 'మాది ఏ కులం?' 'తత్వం' జ్యూరీ బహుమతులకు ఎంపికయ్యాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, సినీ దర్శకుడు యానాల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి..

పల్నాడు కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు-2023లను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక కళలను అభివృద్ధి పరిచేలా కళాక్షేత్రం పనిచేయాలని కోరారు. ఔత్సాహిక దర్శకులు రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌లను తిలకించి అభినందించారు. న్యాయనిర్ణేతలుగా విమానం సినీ దర్శకుడు యానాల శివప్రసాద్, యువకవి కట్టా సిద్ధార్థ వ్యవహరించారు. కార్యక్రమంలో కళాక్షేత్రం అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వర రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.బాషా, కోశాధికారి అర్షద్ అలీ, ఉపాధ్యక్షురాలు చంద్రకళ, సభ్యులు షేక్ బాజీమస్తాన్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నకొడుకే మోసం చేశాడయ్యా..!

- ఉన్న ఇంటిని మాకు తెలియకుండా తాకట్టు పెట్టాడు
- జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి వద్ద గోడు వెళ్లబోసుకున్న వృద్ధ దంపతులు
- జగనన్నకు చెబుదాంలో 62 ఫిర్యాదులు స్వీకరణ



జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితుల గోడు వింటున్న జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి

నరసరావుపేట: కన్న కొడుకే నివాసం ఉన్న ఇంటిని తాకట్టు పెట్టి మోసం చేశాడని తల్లిదండ్రులు జమ్ముల పున్నయ్య, సీతారావమ్మలు వాపోయారు. సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలకు చెందిన 62 ఫిర్యాదులు అందుకున్నారు. వీటిలో నరసరావుపేట పట్టణంలోని బరంపేటకు చెందిన వృద్ధులైన పున్నయ్య, సీతారావమ్మలకు ముగ్గురు కుమారులు. వారికి వివాహమైంది. వీరికి మూడుసెంట్లలో సొంత ఇల్లు ఉంది. వీరిలో రెండో కుమారుడు తల్లిదండ్రులకు తెలియకుండా నకిలీ పత్రాలను సృష్టించి వాటిని గుంటూరులోని ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ.10లక్షలకు తాకట్టు పెట్టాడు. తీసుకున్న సొమ్ము చెల్లించకపోవటంతో ఫైనాన్స్‌వారు ఇంటికి నోటీసు అంటించి వెంటనే ఖాళీచేయాలని బెదిరింపులకు దిగారు. కొడుకు చేసిన మోసం తెలుసుకున్న తల్లిదండ్రులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసి నకిలీ పత్రాలు సృష్టించిన కుమారుడు, ఆ పత్రాలను తాకట్టు పెట్టుకున్న ఫైనాన్స్ వారిపై చర్యలు తీసుకొని, తమకు రక్షణ కల్పించాలని కోరారు.



ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వృద్ధ దంపతులు పున్నయ్య, సీతారావమ్మ

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు కృషిచేయాలని ఆదేశించారు. తమ సమస్యలు విన్నవించుకోవడానికి విచ్చేసిన ప్రజలకు వైఎస్సార్ సీపీ నరసరావుపేట 26వ వార్డు నాయకుడు మోటుపల్లి అంజి ఉచిత అన్నదాన కార్యక్రమానికి సహాయం అందించారు. జిల్లా అధికారులు, ఆర్గనైజర్లు ప్రవల్లికా సత్యం, పి.మధుసూదన్‌రావు సీహెచ్ వెంకట శ్రీనివాస్‌రావులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు ఎస్పీ(అడ్మిన్) ఆర్.రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, క్రైం అదనపు ఎస్పీ ఎస్.కె.చంద్రశేఖర్, డీఎస్పీలు కె.వి.మహేష్, పల్లపురాజు, బి.ఆదినారాయణ, యు.రవిచంద్ర, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లు నిర్మిస్తామని మోసం చేశారు..

నాకు ఇంటి నిర్మాణం చేసే నిమిత్తం ఓ వ్యక్తి రూ.2.5లక్షలకు కాంట్రాక్ట్ తీసుకొని రూ.2లక్షలు ఇచ్చిన తర్వాత ఇల్లు నిర్మించకుండా, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నాడు. అతడిపై చర్యలు తీసుకొని నా డబ్బులు నాకు ఇప్పించండి.

– ఓ మహిళ, నరసరావుపేట

అప్పు చెల్లించకపోతే చంపుతామంటున్నారు

నాకు ఇద్దరు అబ్బాయిలు. వారిలో అరుణ్‌కుమార్ ఆన్‌లైన్ బస్సు, ట్రైన్ టికెట్స్ బుకింగ్ చేస్తూ ఉండేవాడు. కొంతమంది వద్ద అప్పులు చేసి డబ్బులు కట్టలేక ఎటో వెళ్లిపోయాడు. అప్పు ఇచ్చిన వారిలో ఓ వ్యక్తి ఆ డబ్బులు నువ్వు కట్టు అని తిడుతూ చంపుతామని బెదిరిస్తున్నాడు. నాకు అతడి నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయండి.

– ఓ మహిళ, మాచర్ల పట్టణం

భర్త వాటా డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి

నా భర్త కృష్ణమనేని కృష్ణప్రసాదు మరో ఇద్దరితో కలిసి 2017 నుంచి 2019వరకు పెదకూరపాడు ప్రాంతంలో అనేక చోట్ల కాంట్రాక్టుపై సీసీరోడ్ల నిర్మాణం చేశారు. వీటికి గాను రూ.80లక్షల వరకు తన వాటా కింద నా భర్త ఖర్చుచేశాడు. 2021లో నా భర్త అకస్మాత్తుగా చనిపోయాడు. అప్పటినుంచి ప్రభుత్వం నుంచి డబ్బులు వచ్చినా మిగతా ఇద్దరు వ్యక్తులు నా భర్త వాటాకు రావాల్సిన సొమ్ము ఇవ్వకుండా వేధిస్తున్నారు. నీకు దిక్కున్న చోట చెప్పుకో మంటున్నారు. నాకు ఇద్దరు బిడ్డలు, వారు చదువుకుంటున్నారు. నా డబ్బులు ఇప్పించి నాకు న్యాయం చేయండి.

– అనంతలక్ష్మి, పెదకూరపాడు

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌కు క్రీడాకారుల ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

గుంటూరు వెస్ట్(క్రీడలు): జాతీయ పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తేవాలని అథ్లెటిక్ కోచ్ ఈశ్వరరెడ్డి ఆకాంక్షించారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు వరంగల్‌లో నిర్వహించనున్న 37వ సౌత్‌జోన్ నేషనల్స్‌కు ఎంపికైన క్రీడాకారులకు జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక చంద్రమౌళీనగర్‌లోని నాథ్‌వెల్‌నెస్ సెంటర్లో అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగడం అంత సులభం కాదన్నారు. విజయమే లక్ష్యంగా బరిలో దిగాలని తెలిపారు. అనంతరం జిల్లా అథ్లెటిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, ఈశ్వరరెడ్డి, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, నూతలపాటి గోపీనాథ్, గమిడి సాంబశివ రావు క్రీడా దుస్తులు బహూకరించారు. ఎం.వెంకట మారుతీ గురుశంకర్, పి.నరేంద్ర, సిహెచ్.ఆదినారాయణ, బి.నాగవిహారిక, టి.నాగ యోచన, ఎం.మధుబాబు, ఇ.హేమసాయి, ఎండీ ఆసియా, రూపలిత పాత్ర, ఎస్కే నూర్, ఎస్.కె.రోషన్, ఎస్కే కరీష్మ, ఎం.అఖిల్ వర్ధన్, వి.హాసిని.

ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం



గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా వీరపనేని సురేష్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశంతో పాటు ఉమ్మడి జిల్లా శాఖకు కార్యవర్గ ఎన్నిక పంచాయతీరాజ్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీవీ సూర్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎల్ సోమయాజులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా డిప్లొమా ఇంజినీర్స్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్ర రెడ్డి, ఎన్నికల పరిశీలకులుగా పూర్వపు అధ్యక్షుడు అట్లూరి రాంబాబు ఎన్నికల ప్రక్రియ నిర్వహిచారు. సంఘ జిల్లా కార్యదర్శిగా జి.కోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షునిగా జి.దేవసహాయం, ఉపాధ్యక్షునిగా పీఎస్వీ ఎస్ఎస్ ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.ఇస్సాకు, ఆర్థిక కార్యదర్శిగా షేక్ ఖాదర్‌వలి, సంయుక్త కార్యదర్శులుగా బి.కృష్ణానాయక్, టి.నాగరాజు, పి.రహంతుల్లాతో పాటు ఈసీ మెంబర్లుగా 11 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గుంటూరు డివిజన్‌లో పలు స్టేషన్‌లకు స్టాప్‌ల కేటాయింపు

సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ప్రయాణికుల సౌకర్యర్థం పలు స్టేషన్‌లలో స్టాప్‌లు కేటాయించినట్లు డివిజన్ సీనియర్ మేనేజర్(డీసీఎం) దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నెంబర్ 12795 విజయవాడ- లింగంపల్లి రాత్రి 8.10 గంటలకు విజయవాడ నుంచి బయలు దేరుతుందని, 12796 లింగంపల్లి- విజయవాడ రైలు లింగంపల్లి స్టేషన్ నుంచి ఉదయం 06.50 గంటలకు బయలు దేరుతుందని తెలిపారు. ఈ రైళ్లకు సోమవారం నుంచి నల్గొండ స్టేషన్‌లో స్టాప్ కేటాయించినట్లు చెప్పారు. అదే విధంగా రైలు నెంబర్ 17645 సికింద్రబాద్- రేపల్లె రైలు మధ్యాహ్నం 02.05 గంటలకు సికింద్రబాద్ స్టేషన్ నుంచి బయలు దేరుతుందని, 17646 రేపల్లె- సికింద్రబాద్ రైలు రేపల్లె స్టేషన్ నుంచి ఉదయం 11.54 గంటలకు బయలు దేరుతుందని తెలిపారు. ఈ రైళ్ల ఈనెల 9వ తేదీ నుంచి చిట్యాల స్టేషన్‌కు స్టాప్ కేటాయించడం జరిగిందని వివరించారు.

డ్రాగన్ ఫ్రూట్ రైతులకు ఘన సన్మానం

నరసరావుపేట: డ్రాగన్ ఫ్రూట్స్ పంటను వేసి అధిక దిగుబడులు సాధించిన జిల్లాకు చెందిన ఇరువురు రైతులను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అభినందించారు. రైతు వందనం కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో రెంటచింతలకు చెందిన కుందూరు చిన్నపరెడ్డి, దాచేపల్లి మండలం శంకరాపురంకు చెందిన భూక్యా సురేష్‌నాయక్‌లను కలెక్టర్ దుశ్శాలువా కప్పి సన్మానించారు. రైతు చిన్నపరెడ్డి తనకు చెందిన రెండెకరాల పొలంలో ఎకరానికి రూ.5లక్షల పెట్టుబడితో గతేడాది డ్రాగన్‌ఫ్రూట్ పంటను వేశారు. ఈ ఏడాది ఎకరానికి 2.5టన్నుల చొప్పున ఐదు టన్నుల దిగుబడిని సాధించారు. టన్ను రూ.1.20లక్షలు చొప్పున ఐదు టన్నులకు రూ.6లక్షల రాబడి సాధించారు. అలాగే రైతు సురేష్‌నాయక్ ఎకరం పొలంలో నాలుగేళ్ల క్రితం డ్రాగన్ ఫ్రూట్ పంటను రూ.5లక్షల పెట్టుబడితో సాగు చేశారు. నాల్గో ఏడాది ఆరుటన్నుల దిగుబడి లభించింది. ఉద్యాన శాఖ జిల్లా అధికారి బీజే బెన్నీ మాట్లాడుతూ మూడవ ఏడాది నుంచి 30 ఏళ్లవరకు ఎకరానికి ఐదు టన్నుల నుంచి ఆరు టన్నుల వరకు దిగుబడి లభిస్తుందన్నారు. ప్రతి ఏడాది సరాసరిగా టన్నుకు రూ.1.20లక్షల చొప్పున రూ.6లక్షల వరకు నికర ఆదాయం లభిస్తుందన్నారు. ట్రైనీ కలెక్టర్ ఎంఆర్ కల్పశ్రీ, జేసీ ఎ.శ్యామ్‌ప్రసాదు, డీఆర్ఓ కె.వినాయకం పాల్గొన్నారు.

స్వామినాథన్ సేవలు అపూర్వం ..

నరసరావుపేట: దేశానికి వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్ చేసిన సేవలు అనిర్వచనీయమైనవని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. ఉద్యానశాఖ జిల్లా అధికారి బీజే బెన్నీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం ఇటీవల మృతిచెందిన స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రజల ఆకలి కేకలను తరిమికొట్టేందుకు గ్రీన్ రివల్యూషన్ తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన చేసిన సేవలను సదా స్మరించుకోవటం ముదావహమన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, ట్రైనీ కలెక్టర్ ఎంఆర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శ్రీదేవి శరన్నవరాత్రులకు ముస్తాబు



శరన్నవరాత్రులకు సిద్ధమవుతున్న వేదిక

వినుకొండ టౌన్: దసరా నవరాత్రుల నేపథ్యంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను హిమాలయ గురువులు ఆశీస్సులతో రెండవ పర్యాయం పట్టణ శివారులోని సాయి బృందావనంలో నిర్వహిస్తున్నట్లు వినుకొండ శాంతి ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు సోమవారం తెలిపారు. భారీ వేదికపై కోల్‌కత కళాకారులచే చెరువు మట్టితో 10అడుగుల అమ్మవార్ల మట్టి విగ్రహాలు కొలువు తీరనున్నాయన్నారు. కార్యక్రమాలలో భాగంగా 9రోజులపాటు 18హోమ గుండాలతో మహా చండీయాగం, విశిష్ట పూజా కార్యక్రమాలు, అమ్మవారికి విశేషమైన అలంకారాలు, అమ్మవార్ల ఊరేగింపు, ప్రతిరోజు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను హిమాలయ గురూజీ చేతుల మీదుగా నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్ట్ సభ్యులు పెండేల పుల్లారావు, డాక్టర్ ఆనంద్‌కుమార్, పెండేల కాశి, మునిరెడ్డి, పెండేల మోహన్‌రావు, తాత రమేష్, రామడుగు కోటేశ్వరరావుతోపాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



నరసరావుపేట: భారతీయ జనతా పార్టీ పల్నాడు జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సోమవారం సత్తెనపల్లిరోడ్డులోని పార్టీ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్, పార్లమెంటు ఇన్‌చార్జి టి.రామకృష్ణారెడ్డి జాబితాను ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా నరసరావుపేటకు చెందిన మేడికొండ సత్యానందబాబు, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పెరుమారెడ్డి భారతీదేవి(పెదకూరపాడు), కూనిశెట్టి వెంకటేశ్వర్లు (మాచర్ల), ఉల్లి రమాదేవి (గురజాల), ఎండ్లూరి వీరయ్య(వినుకొండ) నియమించారు. ప్రధాన కార్యదర్శిగా సత్తెనపల్లికి చెందిన గుడిపల్లి కృష్ణమోహన్, కామినేని హనుమంతరావు(నరసరావుపేట), మేడం రమేష్(వినుకొండ), కేతనబోయిన హనుమంతరావు(గురజాల), కోశాధికారిగా పెదకూరపాడుకు చెందిన ఊటుకూరి నరసింహారావు, కార్యదర్శులుగా నరసరావుపేటకు చెందిన చిరుమామిళ్ల ఆదినారాయణతో పాటు మరో ఆరుగురిని నియమించారు.

ఏసీఏ సెంట్రల్‌జోన్‌లో గుంటూరు ఘన విజయం

- ప్రకాశం జట్టుపై 3 వికెట్ల తేడాతో విజయం
- రేపు గుంటూరు-కృష్ణా జట్ల మధ్య మూడో మ్యాచ్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ, ఎస్కేఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో ఏసీఏ సెంట్రల్ జోన్ అండర్-23 అంతర్ జిల్లాల మూడు రోజుల టెస్ట్‌మ్యాచ్‌లలో భాగంగా జరుగుతున్న గుంటూరు, ప్రకాశం జిల్లాల మ్యాచ్‌లో గుంటూరు జిల్లా జట్టు 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆదివారం నాటి ఓవర్‌నైట్ స్కోర్ 3 వికెట్ల నష్టానికి 52 పరుగులతో సోమవారం చివరిరోజు ఆట కొనసాగించిన గుంటూరు జట్టు విజయానికి అవసరమైన 107 పరుగులను మరో నాలుగు వికెట్లు కోల్పోయి సాధించింది. జట్టు కెప్టెన్ మామిడి వంశీకృష్ణ 58 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడగా, కె.మనోహర్ 34, పి.ఆదిత్యారెడ్డి 21 పరుగులతో జట్టు విజయంలో తమవంతు పాత్ర పోషించారు. ప్రకాశం బౌలర్లు పాశం నవీన్ 3, దుర్గాబాలాజీ 2, సాయి 2వికెట్లు సాధించారు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు. కాగా, ఈనెల 11వతేదీ బుధవారం నుంచి గుంటూరు, కృష్ణా జిల్లాల జట్ల మధ్య మూడో మ్యాచ్ జరగనుంది.

స్కూల్స్ గేమ్స్ ఎంపిక పోటీలు

నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ సెపక్ తక్రా, కబడ్డీ జిల్లా జట్లు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ పల్నాడు జిల్లా కార్యదర్శి సిహెచ్.కోటేశ్వరరావు సోమవారం తెలిపారు. సెపక్ తక్రా అండర్-14, అండర్-17 బాల బాలికల జట్ల ఎంపికలను మంగళవారం సత్తెనపల్లి మండలం గుడిపూడి జెడ్పీ హైస్కూల్‌లో, కబడ్డీ అండర్-17 బాల బాలికల జట్ల ఎంపిక పోటీలను ఈనెల 13వ తేదీ నాదెండ్ల మండలం సాతులూరు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఆయా తేదీలలో ఉదయం 9 గంటలకు అర్హత పత్రాలతో హాజరుకావాలని సూచించారు. అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో క్రీడాకారులు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలని కోరారు.

మానసిక ఆరోగ్యం అందరికీ అవసరం

- ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్
- జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు

ఏఎన్‌యూ: సమాజంలో మానసిక ఆరోగ్యానికి ఎంతో ప్రాముఖ్యం పెరిగిందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈనెల 14న యూనివర్సిటీ సైకాలజీ విభాగం, సైకాలజిస్టుల సంఘం ఏపీఏ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యానికి ఎంత ప్రాధాన్యం ఇస్తామో మానసిక ఆరోగ్యానికి కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. ప్రస్తుతం సమాజంలో అన్ని వర్గాల్లోనూ మానసిక సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, వీటిపై అవగాహన కల్పించడమే దీనికి సరైన మందు అని ఆయన అభిప్రాయపడ్డారు. సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ బి.నాగరాజు మాట్లాడుతూ మానసిక అంశాలపై అవగాహన కల్పించేందుకు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సైకాలజీ విభాగం అసిస్టెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ వసంతరావు, అధ్యాపకులు డాక్టర్ టీడీ విమల, ఎస్.అనుపమ, ఏపీఏ ఇండియా ప్రతినిధులు కృష్ణ భరత్, తేజ పాల్గొన్నారు.